నిధులు మింగిన ఎలుకలు

పెద్దాస్పత్రిలో ఎలుకలు పట్టేందుకు ఏటా రూ.75 లక్షల ఖర్చు

- నామమాత్రం చర్యలతో యథేచ్ఛగా ఎలుకలు, పాముల సంచారం
- మెడికల్ కళాశాల, ప్రభుత్వాసుపత్రి, కంటి ఆసుపత్రుల నిర్వహణ గాలికి..
- ఇబ్బంది పడుతున్న రోగులు, సహాయకులు



కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రి ఆవరణలో భోజనం చేద్దామని కూర్చుంటే చాలు మనుషులకు తోడుగా ఎలుకలు వచ్చి కూర్చుంటాయి. చీకటి పడితే చాలు ఆసుపత్రిలో ఝుమ్మని దోమల దండు వాలిపోతుంది. ఒకవైపు వేసవి ఉష్ణోగ్రత మండిపోతున్నా ఆసుపత్రిలో మాత్రం దోమల బెడద ఆగిపోవడం లేదు. మరోవైపు పట్టపగలే పాములు తిరుగుతూ రోగులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఎలుకలు పట్టేందుకు మూడు చోట్లా ఏటా లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నా సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు.

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలతో పాటు కర్నూలు మెడికల్ కాలేజీ, ప్రాంతీయ కంటి ప్రభుత్వ ఆసుపత్రిలలో పెస్ట్ కంట్రోల్ చేసేందుకు గానూ ఓ ప్రైవేట్ ఏజెన్సీకి పనులు అప్పగించారు. ఈ సంస్థ నుంచి మరో వ్యక్తి సబ్‌లీజ్‌కు తీసుకుని నిర్వహిస్తున్నట్లు సమాచారం. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో గుంటూరు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చిన్నారులను ఎలుకలు కొరికిన ఘటన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పెస్ట్ కంట్రోల్ నిర్వహణకు ఈ నిర్ణయం తీసుకున్నారు. సైంటిఫిక్ శానిటేషన్ పాలసీ కింద ఆసుపత్రిలో దోమలు, బల్లులు, బొద్దింకలు, ఈగలు, ఎలుకలు, పాములు, ఇతర విషకీటకాల నివారణకు వాడే పెస్టిసైడ్స్‌ను మధ్యాహ్నం వరకు హెల్త్ సూపర్‌వైజర్ల ఆధ్వర్యంలో ఫాగింగ్ చేయాల్సి ఉంటుంది. ఎలుకలు, పాములు ఉంటే వాటిని పట్టుకుని సంహరించాల్సి ఉంటుంది. ఈ మేరకు నిర్వహణకు గాను కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నెలకు రూ.6.10 లక్షలు, కంటి ఆసుపత్రిలో రూ.60 వేలు, మెడికల్ కాలేజీలో మరో రూ.2 లక్షల దాకా ఖర్చు చేస్తున్నారు. ఈ మూడు ప్రాంతాల్లో ఏటా రూ.75 లక్షల వరకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తోంది. సైంటిఫిక్ శానిటేషన్ పాలసీ కింద ఆసుపత్రిలో చీడల నివారణకు వాడే క్రిమిసంహారక మందులను హెల్త్ సూపర్‌వైజర్ల ఆధ్వర్యంలో ఫాగింగ్ చేయించాలి. ఎలుకలు, పందికొక్కులు, పాములు ఉండే బొరియల వద్ద అవసరమైన చర్యలు తీసుకుని వాటిని నిర్మూలించాలి. ఇందుకు సంబంధించి ప్రభుత్వ ఆసుపత్రిలో 8 మంది, కంటి ఆసుపత్రిలో ఒకరు, కళాశాలలో ఇద్దరు చొప్పున పనిచేస్తున్నారు.

నామమాత్రంగా నిర్వహణ

ఆసుపత్రిలో పెస్ట్ కంట్రోల్ నిర్వహణ నామమాత్రంగా జరుగుతోంది. ఫిర్యాదులు వచ్చిన చోట మాత్రం వెళ్లి సిబ్బంది పనులు నిర్వహిస్తున్నారు. రోజూ పాములు, ఎలుకలు సంచరించే చోట అవసరమైన చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలున్నాయి. వీరి పనులను పర్యవేక్షించాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వీరి పనితీరు చూసి అధికారులు మార్కులు వేస్తే అవసరమైన నిధులు సదరు ఏజెన్సీకి వస్తాయి. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించి వారికి మంచి మార్కులు వేస్తున్నారన్న విమర్శలున్నాయి. పెస్ట్ కంట్రోల్ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా దాదాపు రూ.75 లక్షలకు పైగా ఖర్చు చేస్తున్నా అధికారులు ఉదాసీన వైఖరి వల్ల ప్రభుత్వ ఉద్దేశం నెరవేరడం లేదు.



ఆసుపత్రిలో సంచరిస్తున్న పాములను, ఎలుకలను చంపిన సిబ్బంది

విచ్చలవిడిగా పాములు, ఎలుకల సంచారం

ఆసుపత్రిలో రోజూ సాయంత్రమైతే చాలు దోమలు విజృంభిస్తున్నాయి. ప్రతిరోజూ రోగులు దోమల నుంచి కాపాడుకోవడానికి మస్కిటో కాయిల్స్, లిక్విడ్స్ వాడుతున్నారు. అంటువ్యాధుల విభాగం, క్యాన్సర్ విభాగం, గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం వద్ద, డైట్ సెక్షన్, ఎంసీహెచ్ భవనం, వైద్య విద్యార్థుల హాస్టల్స్, పీజీ హాస్టల్స్, గైనిక్ విభాగం, మెడికల్ విభాగాల వెనుకవైపున యథేచ్ఛగా పాములు సంచారం కొనసాగుతోంది. చిన్నపిల్లల వార్డుతో పాటు గైనిక్ విభాగం, మెడికల్ విభాగాలు, బూత్‌బంగ్లాల వద్ద రోగుల సహాయకులు ఆరుబయట భోజనం చేసి, అక్కడే చేతులు కడుక్కోవడంతో మిగిలిపోయిన ఆహారాన్ని తినేందుకు ఎలుకలు, బొద్దింకలు అధికంగా వస్తున్నాయి. వార్డులోని గోడలు, మూలలు శుభ్రం చేయకపోవడం వల్ల బూజు పట్టి బల్లులకు ఆవాసంగా మారింది.

సిబ్బందిని హెచ్చరిస్తూనే ఉన్నాం



ఆసుపత్రిలో పెస్ట్ కంట్రోల్ నిర్వహణ బాగానే సాగుతోంది. రోగులు, వారి సహాయకులు ఆరు బయట ఆహారం తిని మిగిలిన వ్యర్థాలు పారబోయడం వల్ల వాటిని తినేందుకు బొద్దింకలు, ఎలుకలు వస్తున్నాయి. ఎలుకలను తినేందుకు పాములూ వస్తున్నాయి. వీటిని గుర్తించి ఎప్పటికప్పుడు సిబ్బంది చంపేస్తున్నారు. కానీ ఇవి కనిపించకుండా చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం. ఆ మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి, సూపరింటెండెంట్, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల

క్లుప్తంగా

భూహక్కు పత్రాల పంపిణీ వేగవంతం చేయండి

కర్నూలు(సెంట్రల్): భూ హక్కు పత్రాల పంపిణీని వేగవంతం చేయాలని భూపరిపాలన ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ సీసీఎల్‌ఏ కార్యాలయం నుంచి ఆయన వివిధ రెవెన్యూ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కొన్ని జిల్లాల్లో భూ హక్కు పత్రాల పంపిణీ పెండింగ్‌లో ఉందన్నారు. ప్రతిరోజూ స్టోన్ ప్లాంటేషన్ వివరాలను తెప్పించుకొని సమీక్షలు నిర్వహించుకోవాలని కలెక్టర్లకు సూచించారు. ఏప్రిల్ 22 నుంచి ఇప్పటి వరకు ఎంతమంది రైతులు పాసు బుక్కులు కావాలని దరఖాస్తు చేసుకున్నారని, ఎన్నింటిని జనరేషన్ చేశామన్న వివరాలను సచివాయలయాల వారీగా తెప్పించుకోవాలన్నారు. కర్నూలు జిల్లాలో సర్వేకు సంబంధించి అన్ని పెండింగ్ పనులను మే 28లోపు పూర్తి చేస్తామని కలెక్టర్ సీసీఎల్‌ఏ ప్రధాన కార్యదర్శికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జేసీ ఎస్.మౌర్య, డీఆర్వో నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

కర్నూలు(సెంట్రల్): అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డీసీసీ అధ్యక్షుడు ఎం.సుధాకర్‌బాబు గురువారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలకు మామిడి, చీనీ, ఇతర పండ్లతోటలతోపాటు కల్లాల్లో ఉన్న మిరప, వేరుశనగ తదితర పంటలు తడిసిపోయాయి తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ఆయా రైతుల వివరాలను సేకరించి పరిహారాన్ని మంజూరు చేయాలని ఆయన కోరారు.

వ్యక్తి అదృశ్యం



శేషన్న

కర్నూలు: కల్లూరు మండలం మహాత్మానగర్ కు చెందిన నాయకంటి శేషన్న (52) అదృశ్యమయ్యాడు. గౌండా పని చేస్తూ జీవనం సాగించే శేషన్‌కు నాలుగేళ్ల క్రితం కుమారుడు మరణించాడు. అప్పటి నుంచి దిగాలుగా ఉంటున్న శేషన్న ఫిబ్రవరి 18న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కర్నూలుతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ లేకపోవడంతో గురువారం అతని భార్య హుసేనమ్మ నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మతోన్మాద బీజేపీని సాగనంపుదాం

కర్నూలు(సెంట్రల్): మతోన్మాద బీజేపీని సాగనంపే వరకు పోరాటం ఆగదని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ అన్నారు. శుక్రవారం సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో ప్రచారభేరీ కార్యక్రమం నగరంలోని మండి బజార్ నుంచి బేకార్ కట్ట వరకు సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ పాలనలో అంబానీ, అదానీలు దేశాన్ని దోచుకుంటున్నారని విమర్శించారు. పబ్లిక్ రంగ సంస్థలను ప్రైవేటీకరించి కార్పొరేటర్లకు దోచి పెడుతున్న మోదీని వచ్చే ఎన్నికల్లో సాగనంపాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుల రాజశేఖర్, గురుశేఖర్, ఎం.విజయ్, షరీఫ్, రామకృష్ణ పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీపై కేసు నమోదు చేయాలి

కర్నూలు(సెంట్రల్): మహిళా రెజ్లర్లను వేధించిన బీజేపీ ఎంపీ భూషన్ శరణ్ సింగ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి అలివేలు డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతదేశ కీర్తిని రెపరెపలాడేలా చేసే రెజ్లర్లపై ఎంపీ లైంగిక దాడికి పాల్పడడం అన్యాయమన్నారు. ఈ విషయంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ జాతికి క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నగేష్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ, రైతుసంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప పాల్గొన్నారు.

ఈ-శ్రామ్‌తో ప్రయోజనాలు

కర్నూలు(రాజ్‌విహార్): ప్రభుత్వం అసంఘటిత కార్మికులకు జారీ చేసే ఈ-శ్రామ్ కార్డులతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని కార్మిక శాఖ కర్నూలు సహాయాధికారి కేశన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికులందరూ తమ సమపంలోని సచివాలయాలు, మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకొని గుర్తింపు కార్డులు పొందాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కర్నూలు: కర్నూలు శివారులోని నంద్యాల రోడ్డులోని కేంద్రీయ విద్యాలయ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దూదేకుల సమీర్ అహ్మద్ (28) అక్కడికక్కడే మృతిచెందాడు. కర్నూలు మండలం పసుపుల రోడ్డులోని బాలాజీ విలాస్‌లో ఈయన నివాసముంటాడు. గురువారం ఉదయం గాయత్రి ఎస్టేట్‌లో ఉన్న జిమ్‌కు వెళ్లి బైక్‌పై తిరిగి ఇంటికి వెళ్తుండగా చెక్‌పోస్టు 100 ఫీట్ రోడ్డు నుంచి వేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొట్టడంతో సమీర్ అహ్మద్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈయన బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసేవాడు. ఉద్యోగం మానుకుని కొన్నాళ్లుగా ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈయన తండ్రి ఫక్రుద్దీన్ సాహెబ్ వెల్దుర్తి ఈఓఆర్డీగా పనిచేస్తున్నాడు. విషయం తెలిసిన వెంటనే ట్రాఫిక్ ఎస్‌ఐ గిరిబాబు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం తీరును పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్యవైశ్యులు ఐక్యతతో ముందడుగు వేద్దాం

కర్నూలు కల్చరల్: ఆర్యవైశ్యులు ఐక్యతతో ముందడుగు వేయాల్సిన అవసరముందని పారిశ్రామిక వేత్త టీజీ భరత్ అన్నారు. గురువారం స్థానిక ప్రకాష్ నగర్‌లోని అవోపా సేవా సదన్‌లో ఏర్పాటు చేసిన నూతన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద ఆర్యవైశ్యుల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం నూతన కమిటీని టీజీ భరత్, అవోపా రాష్ట్ర ఉపాధ్యక్షులు చిట్టెం రమేష్, జిల్లా అధ్యక్షులు ఆత్మకూరు సుబ్రహ్మణ్యం, రాష్ట్ర నాయకులు జవహర్‌బాబు, నాగేశ్వరరావు, యుగంధర్ శెట్టి సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అవోపా నూతన కమిటీ

అధ్యక్షుడిగా ఎం.వి.సరేష్, ప్రధాన కార్యదర్శిగా జి.వి.మురళీకృష్ణ, కోశాధికారిగా ఎం.పురుషోత్తం, ఉపాధ్యక్షులుగా రమణయ్య, గురుప్రసాద్, లగిశెట్టి కిషోర్, సంయుక్త కార్యదర్శులుగా రవికుమార్ గుప్తా, గుండా శ్రీధర్, సుమన్, సభ్యులుగా పార్థసారథి, లక్ష్మయ్య, సూర్యనారాయణ, ప్రవీణ్, నరసింహయ్య, మురళి, శ్రీనివాస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

శ్రీశ్రీకి ఘన నివాళి

కర్నూలు సిటీ: సుందరయ్య స్ఫూర్తి కేంద్రం, శ్రీశ్రీ జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గురువారం సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీలో శ్రీశ్రీ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి కాలేజీ అధ్యాపకులు ఫాతిమా, బి.వెంకటలక్ష్మి, సెయింట్ జోసెఫ్ కాలేజీ అధ్యాపకురాలు ఇందిరమ్మ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో శ్రీశ్రీ ఒక ఒరవడిని సృష్టించారన్నారు. ప్రజల జీవిత వృత్తాంతంగా తన కవితలను, కథలను, గేయాలను, ప్రజలకు అందించిన గొప్ప కవి అని కొనియాడారు. శ్రీశ్రీ కవితలను నేటి యువత చదవాలని, వాటి ద్వారా స్ఫూర్తి పొందాలని సూచించారు. అనంతరం కాలేజీ విద్యార్థులకు 'సాహిత్యం-సమాజంపై ప్రభావం' అంశంపై వ్యాస రచన పోటీలతో పాటు పాటలు, డ్యాన్స్ పోటీలు నిర్వహించారు.

ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు వెదజలుతున్నాయని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం కల్లూరు అర్బన్ 27వ వార్డులోని 69, 70వ సచివాలయాల పరిధిలో ఉన్న అబ్బాస్ నగర్, వెంకటాద్రి నగర్‌లలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. అవినీతి రహిత పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాల్సిన అవసరముందుని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, కార్పొరేటర్లు, జెడ్పీటీసీ ఎ.ప్రభాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ హనుమంతురెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రిప్, తుంపర్ల సేద్యం మంజూరులో ఆర్‌బీకేలే కీలకం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో అవసరమైన రైతులందరికీ డ్రిప్, తుంపర్ల సేద్యం మంజూరులో ఆర్‌బీకేలే కీలకమని ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి తెలిపారు. జిల్లాలో 466 ఆర్‌బీకేలు ఉండగా.. మండలాల వారీగా ఇన్‌చార్జీలకు సూక్ష్మ సేద్యంపై ఈ నెల 25 నుంచి శిక్షణ కార్యాక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గురువారం ఓర్వకల్, కోడుమూరు, సీ.బెళగల్ మండలాలకు చెందిన ఆర్‌బీకే ఇన్‌చార్జీలకు స్థానిక ఉద్యాన భవన్‌లో శిక్షణ నిచ్చారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవీ మాట్లాడారు. జిల్లా వ్యవసాయాధికారి పీఎల్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ వాహన ఇన్సూరెన్స్ సర్టిఫికెట్ల అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్

గద్వాల క్రైం: నకిలీ వాహన ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్‌లు, ఆర్సీలు తయారు చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గురువారం గద్వాలలో ఎస్పీ సృజన విలేకరులకు వెల్లడించారు. కర్నూలులోని అశోక్‌నగర్‌కు చెందిన మీసాల రామస్వామి కొన్నేళ్లుగా కర్నూలు ఆర్టీఏ కార్యాలయం వద్ద ఏజెంట్‌గా జీవనం సాగిస్తున్నాడు. కంప్యూటర్ పరిజ్ఞానం పెంచుకుని పలు వాహనాలకు ఫిట్‌నెస్, ట్రాన్స్‌ఫర్, పర్మిట్, ఇన్సూరెన్స్‌లను సొంతంగా తయారు చేసి నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయిస్తున్నాడు. 2015లో నకిలీ డాక్యుమెంట్స్ తయారు చేస్తున్నట్లు అక్కడి సిబ్బంది గుర్తించి పోలీసులకు అప్పగించారు. జైలుశిక్ష అనంతరం బయటకు వచ్చి ప్రకాశం, ఒంగోలు, అనంతపురం, నంద్యాల, కోడుమూర్‌తో పాటు తెలంగాణలోని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని వనపర్తి, గద్వాల, నల్లగొండ తదితర ఆర్టీఏ ఏజెంట్లతో ఉన్న సంబంధాలతో నకిలీ ఇన్సూరెన్స్, ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్‌ల తయారీకి శ్రీకారం చుట్టాడు. ప్రతి ఏజెంట్‌కు 50 శాతం మేర ఒప్పందం కుదుర్చుకుని గుట్టుగా ఈ వ్యవహారం సాగిస్తున్నాడు. ఓ వ్యక్తి ఇచ్చిన సమాచారంతో ఈనెల 26న అలంపూర్ చౌరస్తాలో కొంతమంది ఏజెంట్లకు నకిలీ ఇన్సూరెన్స్ డాక్యుమెంట్స్ ఇస్తున్నట్లు గుర్తించి సిబ్బంది సహాయంతో ముఠా నాయకుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. విచారణలో మరో 16 మంది సభ్యులు ఉన్నట్లు తెలుసుకుని కర్నూలుకు చెందిన గురప్పగారి చంద్రకుమార్, తలనేరు రవికుమార్, నేచనమిట్ట శ్రీకాంత్, జోగుళాంబ గద్వాల జిల్లాకు చెందిన ఆకేపోగు సుధాకర్, తెలుగు విశ్వనాథ్, తెలుగు మధుసూదన్, మంత్రాలయంకు చెందిన గుండెపోగుల రంగన్న, మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండకు చెందిన షఫీ, వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం యాపర్లకు కోళ్ల ప్రేమకుమార్, నాగర్‌కర్నూల్ జిల్లాలో పనిచేసే పాలకొండకు పొత్తిలి సురేష్‌గౌడ్, నంద్యాలకు చెందిన బోయిని నగేష్, నల్లగొండ జిల్లా పెద్దబండకు చెందిన కొత్త లక్ష్మయ్య, గద్వాల జిల్లా అయిజ మండలం మేడికొండకు చెందిన తిమ్మయ్యగారి కిరణ్‌కుమార్‌రెడ్డి, కర్నూలు ఆటోనగర్‌కు చెందిన సాగినల రఘునాథ్ రెడ్డి, కర్నూలు పట్టణం సంజీవగాంధీనగర్‌కు చెందిన దాసరి ప్రవీణ్‌కుమార్‌లను అరెస్ట్ చేసి వారి నుంచి పలు కంపెనీలకు సంబంధించిన నకిలీ ఇన్సూరెన్స్ డాక్యుమెంట్లు, ఆర్సీలు, డ్రైవింగ్ లైసెన్స్‌ల ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వివరించారు. కేసును డీఎస్పీ రంగస్వామి, సీఐ సూర్యనాయక్, ఆయా పోలీస్‌స్టేషన్ల ఎస్‌ఐలు, ఐటీ కోర్ సిబ్బంది చాకచక్యంగా ఛేదించారన్నారు. మరి కొంతమంది ముఠా సభ్యులను త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు. ఇందులో రవాణా శాఖ అధికారుల పాత్రపై విచారణ చేపట్టి ఈ ముఠాకు సహకరించిన వారిని సైతం అదుపులోకి తీసుకుంటామన్నారు. అరెస్టు చేసిన వారిని అలంపూర్ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్పీ చెప్పారు.

స్టాఫ్‌నర్సు పోస్టుల భర్తీలో అవకతవకలు

- ఏడాదైనా భర్తీ ప్రక్రియ పూర్తి చేయని వైనం
- ఆందోళనలో అభ్యర్థులు

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో స్టాఫ్‌నర్సు నోటిఫికేషన్ విషయంలో అక్రమాలు జరిగినట్లు తెలుస్తోంది. ఏడాదైనా పోస్టులు భర్తీ చేయకపోగా బీసీ-ఏ అభ్యర్థినిని ఎస్సీగా మార్చినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయమై ఓ అభ్యర్థి ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో 2021 డిసెంబర్ 29న స్టాఫ్ నర్సు పోస్టులను భర్తీ చేసేందుకు ఆరవ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ మేరకు 2022 జనవరి 17వ తేదిన మొదటి విడత జాబితాను విడుదల చేసి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇందులో బీసీ-ఏ కేటగిరికి చెందిన జంగం పుష్పలతను ఎస్సీ కేటగిరిలో ఎంపిక చేశారు. దీంతో ఎస్సీ కేటగిరీలో ఉన్న తనకు ఉద్యోగం రాకుండా పోయే ప్రమాదముందని మంటి జయరాజు జిల్లా కలెక్టర్, డీఎంహెచ్‌ఓ, ఏఓ తదితర అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయింది. మరోవైపు ఏడాది దాటినా పోస్టుల భర్తీ ప్రక్రియను అధికారులు నాన్చుతూ ఉండటం అనుమానాలకు తావిస్తోంది. కాగా ఎంపిక ప్రక్రియను రద్దు చేసి కొత్తగా నోటిఫికేషన్ ఇవ్వాలన్న ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇలా చేస్తే ప్రస్తుత జాబితాలో ముందున్న అభ్యర్థులు తమకు అన్యాయం జరిగే అవకాశం ఉందని న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశం ఉంది.

వినియోగదారుల సమస్యలపై స్పందించండి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ వినియోగదారులు చేసే ఫిర్యాదులపై వెంటనే స్పందించి, వారి సమస్యలపై తక్షణం స్పందించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం.ఉమాపతి ఆదేశించారు. గురువారం ఆయన కింది స్థాయి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. మూడు రోజులగా వర్షాలు, గాలుల వల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి ఉంటుందని, వినియోగదారులు చేసే ఫిర్యాదుపై స్పందించి, సరఫరా పునరుద్ధరించాలని సూచించారు. నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పీజీ పరీక్షలకు 90 శాతం హాజరు

కర్నూలు సిటీ: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న పీజీ పరీక్షలకు గురువారం 96 శాతం మంది హాజరు అయ్యారు. వర్సిటీతో పాటు ఉమ్మడి జిల్లాలో ఏర్పాటు చేసిన ఐదు కేంద్రాల్లో జరిగిన పరీక్షలకు 690 మంది విద్యార్థులకు గాను 659 మంది హాజరైనట్లు వర్సిటీ పరీక్షల విభాగం అధికారులు తెలిపారు.

ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ప్రసాద్, వెంకప్ప

- యూనియన్ నుంచి టి.తిరుపాల్ బహిష్కరణ

కర్నూలు(సెంట్రల్): ఐఎఫ్‌టీయూ నూతన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ప్రసాద్, వెంకప్ప ఎన్నికయ్యారు. గురువారం పట్టణంలోని గోకారి భవన్‌లో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో కమిటీ సభ్యుడు సురేష్ నాయక్ ప్రకటించారు. కాగా ఇప్పటి వరకు జిల్లా సహాయ కార్యదర్శిగా కొనసాగిన టి.తిరుపాల్‌ను సంఘం నుంచి బహిష్కరించినట్లు ఆయన చెప్పారు.

ఘనంగా రిడ్జ్ స్కూల్ వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కర్నూలు(సిటీ): నగర శివారులోని లక్ష్మీపురం సమీపంలో ఉన్న రిడ్జ్ పాఠశాల వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ సీఈఓ గోపీనాథ్, ప్రిన్సిపాల్ రాజేంద్రన్‌లు మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను అభ్యసించడం వల్ల ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చన్నారు. భవిష్యత్తు లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానికి అనుగుణంగా నిత్య సాధనతో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

గొలుసు దొంగ అరెస్టు

కర్నూలు: స్థానిక కిసాన్‌ఘాట్ రోడ్డులోని స్విమ్మింగ్ పూల్ వద్ద ఈనెల 15న చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన దొంగను మూడవ పట్టణ పోలీసులు గురువారం అరెస్టు చేసి కటకటాలకు పంపారు. శ్రీరామ్‌నగర్‌కు చెందిన శ్వేత మెడలో 3 తులాల నల్లపూసల బంగారు గొలుసును ఎత్తుకెళ్లిన ఈడిగ యశ్వంత్ గౌడ్‌ను పక్కా సమాచారంతో అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. అతని వద్ద నుంచి 3 తులాల బంగారు నల్లపూసల దండను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

గుండెపోటుతో హమాలీ మృతి

కర్నూలు(అగ్రికల్చర్): స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు హమాలి నెరవాడ సర్వేస్వరరెడ్డి(55) గుండెపోటుతో మృతిచెందాడు. గురువారం మిర్చి షెడ్‌లో పనిచేస్తూ కుప్పకూలాడు. తోటి హమాలీలు 108కు సమాచారం ఇవ్వగా అక్కడకు చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మార్కెట్ సెక్రటరీ గోవిందు, అసిస్టెంట్ సెక్రటరీలు రహిమాన్, వెంకటేశ్వర్లు తదితరులు మృతదేహానికి నివాళులర్పించి అంత్యక్రియల నిమిత్తం మార్కెట్ కమిటీ తరపున రూ.5,000 ఆర్థిక సాయాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు. కాగా మృతుడి కుటుంబానికి రూ.15 లక్షల ఎక్స్‌గ్రేసియా ఇవ్వాలని సీఐటీయూ జిల్లా నాయకులు గౌస్‌దేశాయ్, రాముడు డిమాండ్ చేశారు.

వసతి గృహాల తనిఖీ

కర్నూలు(లీగల్): స్థానిక బి.క్యాంప్ బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ బాలికల, బాలుర వసతి గృహాలు, జువైనల్ హోమ్, వేదాస్ షెల్టర్ హోమ్‌లను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్‌వీఎన్ శ్రీనివాసరావు గురువారం తనిఖీ చేశారు. వసతి గృహాల్లో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించి, పరిశుభ్రతల గురించి వసతి గృహ సంక్షేమాధికారులు సూచనలిచ్చారు.

'నారాయణ' విద్యార్థికి అభినందన

కర్నూలు(సిటీ): ఇంటర్మీడియెట్ ఫలితాల్లో కర్నూలు పాతబస్తీలోని నారాయణ స్కూల్‌కు చెందిన విద్యార్థిని ఎస్.పూజిత 1000 మార్కులకు 987 సాధించారు. గురువారం నారాయణ స్కూళ్ల ఏజీఎం రమేష్ కుమార్ తదితరులు విద్యార్థినిని అభినిందించారు.

పూర్తి స్థాయి మరమ్మతులకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్

కర్నూలు(అగ్రికల్చర్): కలెక్టరేట్‌లోని జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం మరమ్మతు పనులను ఏపీఈడబ్ల్యూఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ లక్ష్మీనారాయణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గోన నాగరాజు జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మితో కలసి పరిశీలించారు. గురువారం 'సాక్షి'లో జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయం దుస్థితిపై చిత్తడిగా మారిన కార్యాలయం శీర్షికను ప్రచురించిన వార్తకు ఏపీఈడబ్ల్యూఐడీసీ ఇంజినీరింగ్ అధికారులు స్పందించారు. పనులను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం మరమ్మతులకు రూ.14.40 లక్షలు మంజూరయ్యాయన్నారు. పనులు కొనసాగుతున్నాయని, రూఫ్ స్లాబ్ బాగా దెబ్బతిని శిథిలా వస్థలో ఉందని, వీటికి ప్రత్యేక మరమ్మతులు చేస్తున్నామని చెప్పారు. 26న కురిసిన భారీ వర్షానికి సిమెంట్ కట్టల్లో నీళ్లు పొంగి రెండు స్లాబుల మధ్య నీళ్లు లీక్ అయినట్లు గుర్తించి మరమ్మతులు చేయిస్తున్నట్లు తెలిపారు.



స్లాబ్‌ను పరిశీలిస్తున్న ఏపీఈడబ్ల్యూఐడీసీ అధికారులు

ఇంటర్ ఫలితాల్లో 'ప్రైవేట్' విద్యార్థుల సత్తా

కర్నూలు (సిటీ): ఇంటర్ ఫలితాల్లో ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు సత్తా చాటారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఆయా కళాశాలల యాజమాన్యాలు గురువారం సన్మానించాయి.

గాయత్రి కాలేజీలు..



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో గాయత్రి కళాశాలల ప్రిన్సిపాల్స్

గాయత్రి జూనియర్ కాలేజీలకు చెందిన విద్యార్థులు అత్యధిక శాతం మార్కులతో ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్స్ వాసుబాబు, పెద్ద రసూల్ తెలిపారు. జూనియర్ ఎంపీసీలో చరణ్ సాయిరెడ్డి 464, బైపీసీలో బి.ఉష వర్షోరా 431, ఎం.సంధ్య 431, సీనియర్ ఎంపీసీలో కె.లక్ష్మీనవ్య 983, కె.అనూష 983, బైపీసీలో డి.స్నేహ 980 మార్కులు సాధించారన్నారు.

శ్రీమేధా కాలేజీ..

శ్రీమేధా జూనియర్ కాలేజీ విద్యార్థులు ఇంటర్‌లో మెరుగైన ఫలితాలు సాధించినట్లు ఆ కాలేజీ ప్రిన్సిపల్ రాము తెలిపారు. జూనియర్ ఎంపీసీలో ఉదయ్‌కిరణ్ 465, మధు 417, శ్రీనిత్య 401, బైపీసీలో ఎ.భాగ్యలక్ష్మి 364, మునేష్ 363, సీనియర్ ఎంపీసీలో ఎస్.జాయిద్, భాస్కర్‌లకు 882, పూజిత 873, ఊర్మిల 863, చైతన్యలక్ష్మి 860 మార్కులు సాధించారన్నారు.

ఆచార్య అకాడమీ..



చౌదరి వాసవి, మాలిక్ , సోహ మెహక్, ఎస్.సాహితి

ఆచార్య ఐఐటీ, జేఈఈ నీట్ అకాడమీ విద్యార్థులు జూనియర్ బైపీసీలో చౌదరి వాసవి 433, డి.మాలిక్ 428, ఎస్.తక్సిన్ కౌసర్ 426, కె.జి అక్షిత 425, ఎస్.మక్కా హుసేన్ 424, ఎస్.ఆసిఫ్ 422 మార్కులు, ఎంపీసీలో సోహ మెహక్ 462, ఎస్.సాహితి 461, సి.మహిత 459, సాత్విక్‌రెడ్డి 459, ఎస్.కె ఆదిబా తక్సిన్ 458, బి.రాగరితిక 457, నవీన్‌కుమార్ 456 మార్కులు, సీనియర్ బైపీసీలో ప్రణతి 969, ఎంపీసీలో జాహ్నవి 988 మార్కులు సాధించారని కాలేజీ డైరెక్టర్లు తెలిపారు.

పంచాయతీరాజ్‌లో పదోన్నతులు

కర్నూలు(అర్బన్): పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఆఫీస్ సబార్డినేట్, ల్యాబ్, లైబ్రరీ, రికార్డ్ అసిస్టెంట్లకు వారి అర్హత, సీనియారిటీ మేరకు టైపిస్టులుగా పదోన్నతి కల్పించినట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఆదేశాల మేరకు జెడ్పీ యాజమాన్య పరిధిలో పనిచేస్తున్న ఆయా కేడర్లలోని వారికి పదోన్నతులు కల్పిస్తూ పోస్టింగులు ఇచ్చినట్లు చెప్పారు. పదోన్నతులు పొందిన వారిలో ఎం.మహమ్మద్ హబీబుల్లాను పీఆర్ విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ సబ్ డివిజన్ కర్నూలు, ఎం.ఎస్.మహబూబ్ బాషా, ఎంపీడీఓ, గూడూరు, కె.సాజిద, ఎంపీడీఓ, వెల్దుర్తి, టి.విష్ణువర్ధన్, ఎంపీడీఓ, కర్నూలు, వి.ఫణీంద్రకుమార్, ఎంపీడీఓ, బండి ఆత్మకూరు కార్యాలయాలకు పోస్టింగ్ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.